# సాక్షి
## వికారాబాద్

గురువారం । 30 । నవంబర్ । 2023







### ఎన్నికల విధుల్లో..

షాద్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అసెంబ్లీ ఎన్నికల్లో సహాయకులుగా పని చేస్తున్నారు. 8లో ▸



### దోపిడీ దొంగల హల్‌చల్

దారిన పోయే వాహనాలను ఆపి కొందరు దుండగులు కత్తులతో బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడ్డారు. 8లో ▸



### ఆహ్లాదంగా పోలింగ్ బూత్

కుల్కచర్ల మండల కేంద్రంలో 135 పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్‌గా నిర్ణయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 9లో ▸

# ఓటేసుడే



## ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్
- ఈవీఎంలతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు
- పోలింగ్ కేంద్రాలు 1,133
- ఓటర్లు 9,60,376

**వికారాబాద్:** రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో పోలింగ్ సెంటర్లకు బయలుదేరి వెళ్లారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ నారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారిని ఇళ్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడానికి ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో వలంటీర్లను నియమించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

### నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ట్రా.జె |
|---|---|---|---|
| పరిగి | 1,31,163 | 1,28,250 | 09 |
| వికారాబాద్ | 1,13,919 | 1,14,321 | 13 |
| తాండూరు | 1,15,143 | 1,20,927 | 06 |
| కొడంగల్ | 1,17,303 | 1,19,310 | 12 |

### అసెంబ్లీ బరిలో ప్రధాన అభ్యర్థులు వీరే..

వికారాబాద్ మెతుకు ఆనంద్ (బీఆర్‌ఎస్), గడ్డం ప్రసాద్‌కుమార్ (కాంగ్రెస్), పీ నవీన్‌కుమార్(బీజేపీ), **తాండూరు** పైలెట్ రోహిత్‌రెడ్డి (బీఆర్‌ఎస్), బీ మనోహర్‌రెడ్డి (కాంగ్రెస్), ఎస్ శంకర్‌గౌడ్(జనసేన), **పరిగి** కొప్పుల మహేశ్‌రెడ్డి(బీఆర్‌ఎస్), రామ్మోహన్‌రెడ్డి (కాంగ్రెస్), మారుతీకిరణ్(బీజేపీ), **కొడంగల్** నరేందర్‌రెడ్డి(బీఆర్‌ఎస్), రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్), రమేశ్‌కుమార్(బీజేపీ).




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

**జిల్లాలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లు**

జిల్లాలో 9,60,376 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 1,133 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,415 ఈవీఎంలు, 1,585 వీవీ ప్యాట్‌లు సిద్ధంగా ఉంచారు. వెబ్ కాస్టింగ్ కోసం 810 కేంద్రాలను ఎంపిక చేశారు. జిల్లాలో 299 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వీటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు 241మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 1,133 పోలింగ్ కేంద్రాల్లో 1,302 మంది పీఓలు, 1,302 మంది ఏపీఓలు 2,604 మంది ఓపీఓలు, 241 మంది మైక్రో అబ్జర్వర్లను నిర్వహించనున్నారు.

### ఓటు వేయాలంటే వీటిలో ఏదో ఒకటి తప్పని సరి

1. ఓటరు గుర్తింపు కార్డు
2. ఫొటో ఓటరు స్లిప్
3. ఆధార్‌కార్డు
4. డ్రైవింగ్ లైసెన్సు
5. రేషన్‌కార్డు
6. పాన్‌కార్డు
7. పాస్‌పోర్టు
8. సర్వీసు గుర్తింపు కార్డు
9. బ్యాంక్ పాస్‌బుక్ (ఫొటోతో ఉండాలి)
10. పోస్టాఫీసు పాస్‌బుక్
11. స్మార్టుకార్డు
12. పెన్షన్ పత్రం
13. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు

### ఈవీఎంలపై అవగాహన కల్పించాం

జిల్లాకు చేరిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను పరిశీలించి పోలింగ్ కేంద్రాలకు తరలించాం. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాం.సమస్యాత్మక కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. పోలింగ్‌ను ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారి, పోలీసు, రెవెన్యూ, సెక్టారు అధికారులు పర్యవేక్షించనున్నారు.

– నారాయణరెడ్డి, కలెక్టర్

### వలస ఓటర్లకు వల

**ఓటు కోసం ఆప్యాయంగా పలకరింపులు**

**కొందుర్గు:** తమ సొంత గ్రామాల్లోని ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి పట్టణాల్లో నివాసం ఉంటున్న వలస ఓటర్లపై అన్ని పార్టీల నాయకులు దృష్టి సారించారు. వారితో ఫోనులో మాట్లాడుతున్నారు. తమ నాయకుల గెలుపు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఓట్లు రాబట్టడానికి వరుసలు కూడా కలిపేసుకుంటున్నారు. బాగున్నారా..ఏమి చేస్తున్నారు.. పిల్లలు బాగున్నారా.. మీ ఓటు మాకే వేయాలంటూ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. మన పార్టీకే ఓటు వేయాలి. మన ఎమ్మెల్యే తప్పకుండా గెలువబోతున్నారు. ఓడిపోయే వారికి వేయకండి. గెలిచే నాయకుడికి వేసినా మెజార్టీ పెరుగుతుందని ఓటర్లను కాకా పడుతున్నారు. గెలిచాకా మీకు ఇళ్లు కావాలన్నా.. పింఛన్ కావాలన్నా ఇప్పించే బాధ్యత తమదే అంటూ హామీలు గుప్పిస్తున్నారు. రాకపోకలకు సైతం ఖర్చులు పంపిస్తామని చెబుతూనే ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు తీసుకుంటున్నారు. ఈ తంతూ వలస ఓటర్ల కోసం అన్ని గ్రామాల్లోనూ సాగుతుంది.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

**మాడ్గుల:** ప్రశాంతంగా స్వేచ్ఛయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. ఇప్పటికే మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు రౌడీషీటర్లను బైండోవర్ చేశామని, ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, నగదు తరలింపును నిలువరించామని తెలిపారు. శాంతియుత ఎన్నికలకు అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## న్యూస్‌రీల్

### ప్రయోగాలవైపు దృష్టి మళ్లించాలి

**కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ**

**మొయినాబాద్ రూరల్:** విద్యార్థులు పరిజ్ఞానంతో పాటు ఆలోచన విధానాన్ని బట్టి కొత్తకొత్త ప్రయోగాలవైపునకు దృష్టి మళ్లించాలని కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రామకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ కళాశాలలో 800 మంది విద్యార్థులు 'ప్రాజెక్టు ప్రదర్శన ఎగ్జిబిషన్‌ను ఎక్స్‌పో' అనే పేరుతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల క్యాంపస్‌లో ఈపీఐసీఎస్ ప్రాజెక్టు ఎక్స్‌పో ఐడియా థాన్ విద్యార్థులకు ఎంతో ఆకట్టుకున్నాయి. కొన్ని రోజులుగా మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రజాసేవలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్, ఉచిత వైద్య సేవలు, పలు కార్యక్రమాలు నిర్వహించి వాటిని ఈ ప్రదర్శనలో వివిధ ప్రాజెక్టుల ద్వారా ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులు ప్రపంచంలోని సామాజిక సేవలకు అనుగుణంగా రూపొందించారని ప్రిన్సిపాల్ అభినందించారు. సమాజంలో విలీనం అయ్యే విధంగా ప్రాజెక్టులను రూపొందించారన్నారు. ఆటోమెటేడ్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్స్, స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సోల్యూషన్స్, రెన్యూవల్ ఎనర్జీ, రీసైక్లింగ్, టెక్నాలజీ, హెల్త్ కేర్ వంటి ప్రాజెక్టులు ప్రదర్శించడం తోటి విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎం.సైదిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

**కందుకూరు:** మండలంలోని కొత్తూర్‌కు చెందిన గురుస్వామి మీగడి చెన్నకేశ్వర్ ముదిరాజ్ 18వ మెట్టు అయ్యప్పస్వామి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అయ్యప్పదాసస్ పి.కేశవ్ గురుస్వామి, ఎ.కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజను జరిపించారు. అంతకు ముందు స్వామికి అభిషేకం, పూజ, 18వ సారి మాలా ధారణ చేసిన చెన్నకేశ్వర్‌ముదిరాజ్‌ను ప్రత్యేకంగా సన్మానించి స్వామి వారి ఆశీస్సులు అందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్, ఏనుగు జంగారెడ్డి తదితరులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు.

### జోరుగా పోల్ మేనేజ్‌మెంట్

**అత్తాపూర్:** ప్రచార గడువు ముగిసిపోవడంతో రాజేంద్రనగర్ అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లను ఆకట్టుకునే పనిలో మునిగిపోయారు. మద్యం, డబ్బు పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఒక్కో ఓటు రెండు వేలతో ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చాలా చోట్ల మద్యం సీసాలు మంగళవారం సాయంత్రమే పంపిణీ అయినట్లు తెలుస్తోంది. వనరులు పుష్కలంగా ఉన్న అధికార పార్టీ రెండు సార్లు మద్యం పంపిణీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీతో పాటు ఇతర పార్టీలు కూడా పంపిణీ చేసినట్లు పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం జెండాలు, బ్యానర్లు లేకుండా నిశబ్ద వాతావరణం నెలకొంది. కాలనీల్లో పెద్దలతో ఓటు వేయించడం కోసం నోట్లు వేయించుకున్నట్లుగా సమాచారం. నిఘా యంత్రాంగం ఎంత కట్టడి చేసినా మద్యం పంపిణీనీ మాత్రం అడ్డుకోలేకపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



వికారాబాద్ అర్బన్: పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన ఎన్నికల సిబ్బంది

## ఓటు.. పాట్లు

- ఓటు వేసేందుకు స్వగ్రామాలకు వెళుతున్న ప్రజలు
- బస్సులు దొరక్క ఇబ్బందులు

**బొంరాస్‌పేట:** పోలింగ్ నేపథ్యంలో ఓటర్లు గ్రామాల బాట పట్టారు. ఉపాధి, ఉద్యోగాలు చేస్తూ పట్టణాల్లో ఉంటున్న వారు తమ ఓటును వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు వెళుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు రద్దీగా మారాయి. రెండు రోజుల నుంచి నగరం నుంచి గ్రామాలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు జనంతో నిండిపోతున్నాయి. ఆర్టీటీ బస్సులను పోలింగ్ అవసరాల కోసం వినియోగిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గ ఓటర్ల కోసం మెహదీపట్నం డిపో నుంచి బస్సులు వేశారు. ఇవి ప్రయాణికులకు సరిపోవడం లేదు. ఒక బస్సు వెళ్లిన తరువాత మరో బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. రోజంతా ప్రయాణానికే సరిపోతుందని వాపోతున్నారు.



ఆర్టీసీ బస్సులో సీట్లు లేక రోడ్డుపై నిరీక్షిస్తున్న కొడంగల్ వాసులు

## పోలింగ్ ప్రశాంతంగా జరగాలి

- రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి

**వికారాబాద్ అర్బన్/పరిగి:** పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం వికారాబాద్‌లోని మేరీ నాట్స్ స్కూల్‌లో, అలాగే పరిగి పట్టణంలోని మినీ స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల వద్ద ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమష్టిగా పనిచేసి పోలింగ్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కేంద్రాలకు వెళ్లగానే సౌకర్యాలు సమకూర్చుకోవాలన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే నోడల్ అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. గురువారం ఉదయం ఐదు గంటలకే కేంద్రాల్లో ఉండాలని, 5:30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి కచ్చితమైన పోలింగ్ వివరాలు జిల్లా అధికారులకు పంపాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వొద్దని ఆదేశించారు. ఏమైన సందేహాలు ఉంటే ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌ను చదివి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. వికారాబాద్ కార్యక్రమంలో వికారాబాద్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ, ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, స్వీప్ నోడల్ ఆఫీసర్ మల్లేశం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, డిప్యూటీ సీఈవో సుభాషిని తదితరులు పాల్గొన్నారు. పరిగి కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు సుధాకర్, ఆర్‌ఓ విజయకుమారి, డీవైఎస్‌ఓ హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంతైనా సరే..గెలవాల్సిందే

తమను గెలిపించాలని మంగళవారం వరకు వరకు ప్రచారం చేసిన అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. ఓటర్లకు నగదు, మద్యం పంచడం ప్రారంభించారు. ప్రధాన పార్టీలన్నీ పోటాపోటీగా ప్రలోభాల పర్వంలో మునిగిపోయాయి.

- పతాకస్థాయికి చేరిన ప్రలోభాలు
- ఓటర్లకు నగదు, మద్యంతో ఎరవేస్తున్న అభ్యర్థులు
- శివారు నియోజకవర్గాల్లో కట్టలు తెంచుకున్న డబ్బు ప్రవాహం
- ఓటుకు రూ.వేయి నుంచి రూ.2వేల వరకు పంపిణీ
- ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదుల వెల్లువ



**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో కొంతమంది అభ్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో మద్యాన్ని ఏరులై పారించిన అభ్యర్థులు.. తాజాగా నగదు పంపకాలు చేపట్టారు. మరి కొద్ది గంటల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో మహిళా పొదుపు సంఘాలు, బస్తీలు, కుల సంఘాల ఓట్లను గంపగుత్తగా కొనుగోలు చేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి.. ఆయా ఏరియాల్లో మెజార్టీ ఓట్లు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు ఒక్కో ఓటుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు ఇస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకుని మరీ డబ్బు పంచుతున్నారు. అయితే తాము పంపిన నగదు ఓటరు దేవుడికి అందిందా లేదా అనే ఆందోళన సైతం అభ్యర్థులను వెంటాడుతోంది. నగదు, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టినా.. నిఘా సంస్థల కళ్లుగప్పి నగదు పంపిణీ చేస్తున్నారు. ఇది గుర్తించిన ప్రత్యర్థి పార్టీలు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం ఉండటం లేదు. పోలీసులకు చిక్కకుండా కొంత మంది తప్పించుకుంటుండగా.. దొరికిన వారిని సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు బరిలో నిలిచిన ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాల్లో నగదు ప్రవాహం కట్టలు తెంచుకుంది.

**పోల్‌మేనేజ్‌మెంట్‌పై దృష్టి**

శివారు జిల్లాలకు చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో నగరానికి నాలుగు వైపులా స్థిరపడ్డారు. ఒక్కో నియోజకవర్గంలో వీరి ఓట్లే రెండు నుంచి మూడు లక్షల వరకు ఉంటాయి. సొంతూరుతో పాటు నగరంలోనూ వీరు ఓటు హక్కును పొందారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయకపోవడంతో చాలా మందికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంది. మొన్నటి వరకు ప్రచారంలో వెంట తిరిగిన వారు తీరా ఓటింగ్ రోజు సొంతూరి బాటపట్టారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో ఓటింగ్ శాతం నమోదు కావడం లేదు. 2018ఎన్నికల్లో శేర్‌లింగంపల్లి నియోజకవర్గంలో ఓటింగ్ శాతం 48.61 శాతం మాత్రమే నమోదైంది. అదే విధంగా ఎల్బీనగర్‌లో 49.58శాతం, మహేశ్వరంలో 55.34 శాతం, రాజేంద్రనగర్‌లో 56.89శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. ముందస్తుగా ఓటర్లకు నగదు పంపిణీ చేస్తే ఓట్లు పడకుండా పోతాయనే భావన అభ్యర్థుల్లో నెలకొంది. ఉదయం ఓటింగ్ ప్రక్రియ మొదలైన తర్వాత పోలింగ్ కేంద్రానికి చేరుకునే ఓటరుకు మాత్రమే నగదు చెల్లిస్తే పక్కగా ఓటును పొందొచ్చని భావిస్తున్నారు. ఆ మేరకు పోలింగ్ బూత్‌లవారీగా నమ్మకస్తులను ఏజెంట్లుగా నియమించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఏజెంట్ల కదలికపై ప్రత్యర్థి పార్టీలు నిఘా ఉంచాయి. నగదు పంచుతున్నట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే వారిని చుట్టుముట్టి, పోలీసులకు అప్పజెప్పుతున్న ఘటనలు లేకపోలేదు.

## క్లుప్తంగా

### పోటాపోటీగా డబ్బుల పంపిణీ

ధారూరు: ఓటర్లను ప్రలోభ పెట్టడంలో ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. ఒక్కో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు పంచినట్లు సమాచారం. మంగళవారం రాత్రి నుంచే ప్రక్రియ ప్రారంభం కాగా.. బుధవారం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. తాము పంచుతున్న డబ్బు లెక్కల్లో ఏమాత్రం తేడా రాకుండా ప్రధాన పార్టీకి చెందిన ఓ జిల్లా ప్రతినిధి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించినట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే వలస వెళ్లిన వారంతా ఓటు వేసేందుకు సొంతూర్లకు చేరుకుంటున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది.

### ఓటు వేసేందుకు వెళ్తూ.. మృత్యుఒడికి

పూడూరు: ఓటు హక్కు వినియోగించుకోవటానికి వచ్చి.. రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గ పరిధి పోలెపల్లి గ్రామానికి చెందిన పద్మమ్మ(45), వెంకటయ్యలు ఉపాధికోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. గురువారం అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఓటు వేసేందుకు ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మండల పరిధి రాకంచర్ల బ్రిడ్జివద్ద ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పద్మమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు నగరానికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందిందని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు ఆచూకీ కోసం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సీపీ



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ చౌహాన్

తుర్కయంజాల్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఓటర్లు ప్రశాతం వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

### డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సందర్శన




మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హోళికేరి

రాజేంద్రనగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వెటర్నరీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చేపడుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఉత్పల్ కుమార్ నస్కర్‌ఈతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజన వసతి ఇతర అన్ని వసతులను ఏర్పాటు చేయగా.. పీఓ, ఏపీఓలతో కూడిన బృందాల హాజరుపై కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎంల పని తీరును ఆమె పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలన్నారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆర్‌ఓలకు సూచించారు. రిటర్నింగ్ అధికారి మల్లయ్య తదితరులున్నారు.



# నేడే శాసనసభ సమరం

- అంతుచిక్కని ఓటరు నాడి
- ఎవరి ధీమా వారిదే..



సార్వత్రిక సమరం సెమీఫైనల్‌కు చేరింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానుండగా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన పార్టీల అభ్యర్థుల గుండెల్లో వంద మైళ్ల వేగంతో రైళ్లు పరిగెడుతున్నాయి. ఓటరు దేవుళ్ల దర్శనం కోసం రేయింబవళ్లు కాలికి బలపం కట్టుకొని ప్రదక్షిణలు చేసిన వారికి.. ఓటర్ల నాడి అంతు చిక్కకపోవడంతో ఇంత చలిలోనూ ముచ్చెమటలు పడుతున్నాయి. విజయం ఎవరిని వరిస్తోందనంటూ ఆందోళన చెందుతున్నారు.

మంచాల: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. సంబంధిత అధికారులు ఇప్పటికే ఓటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 343 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. వాటి పరిధిలో 3,27,657 (మహిళలు 1,61,793, పరుషులు 1,65,827, ఇతరులు 37 మంది) ఓట్లు ఉన్నాయి.

**వారిద్దరి మధ్యే పోటీ**

ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు విస్తృత ప్రచారం చేశారు. నియోజకవర్గాన్ని చుట్టి ముట్టారు. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకొని తాయిలాలు సమర్పించుకున్నారు!. కానీ ఓటరు నాడీ ఎవరికీ అంతు చిక్కకపోవడంతో గెలుపోటములపై ఎవరికి వారే అంచనాలు వేసుకుంటూ.. విజయం తమనే వరిస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఈ రెండు పార్టీల మధ్యే పోటీ తీవ్రత ఉంది. అయినప్పటికీ ఇరు పార్టీల్లో వలసలు భారీగా కొనసాగాయి. అధికార పార్టీకి గ్రామాల్లో బలమైన కేడర్ ఉండటంతో కారు జోరు ఖాయమని గులాబీ శ్రేణులు చెప్పగా.. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇక బీజేపీ, సీపీఎం అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ.. ఓట్లు చీల్చడమే తప్ప.. ఎవరికీ ఉపయోగం ఉండదని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ మధ్య తగ్గపోరు ఉండటంతో రాజకీయ ఉత్కంఠకు తెర లేపింది. ఓటరు ఎవరికి పట్టం కడతారో నన్న టెన్షన్ నెలకొంది. ఏది ఏమైనా నేటి పోలింగ్ అనంతరం డిసెంబర్ 3న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. అప్పటి వరకు అందరూ వేచి చూడాల్సిందే..

## చలికాలంలో ముచ్చెమటలు

- తాండూరులో కొనసాగుతున్న ఉత్కంఠ
- మరో అవకాశం కోసం పైలెట్ ఆరాటం
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న బుయ్యని

తాండూరు: పోలింగ్ మరి కొన్ని గంటల్లో ప్రారంభం కానుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు విస్తృతంగా పర్యటించారు. ఇంటింటి ప్రచారం చేశారు. నన్ను యాది మరువకు అయ్యా, అవ్వా అంటూ వేడుకున్నారు. యువ ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేశారు. ఇంత చేసిన వారికి ఓటరు నాడి అంతు చిక్కడం లేదు. దీంతో ఓటర్లు ఎవరికి అధికారం కట్టబెడతారోనన్న ఉత్కంఠతో పోటీదారులకు చలికాలంలోనూ ముచ్చెమటలు పడుతున్నాయి. తాండూరులో అధికార పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మరో అవకాశం కోసం ఆరాట పడుతుండగా.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డికి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

**హోరా హోరీ ప్రచారం..**

తాండూరు అసెంబ్లీ పరిధిలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య తగ్గపోరు ఉంది. అదే స్థాయిలో ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. సీఎం కేసీఆర్, సినీ నటుడితో పాటు పలువురు నాయకులు ఆయనకు మద్దతుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి.. సెగ్మెంట్ పరిధిలో పట్టు సాధించారు. కేడర్‌ను పటిష్టం చేసుకున్నారు. ఆయనకు మద్దతుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లు ప్రచారం చేశారు. రోడ్ షోలో శ్రేణుల్లో జోష్ నింపారు. బుయ్యనికి ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సునీతా సంపత్‌కుమార్‌లు అన్నీ తామై అండగా నిలవడంతో బలం పెరిగిందని చెప్పవచ్చు. బలం, బలగం ఎవరికున్నా.. ఎంతున్నా.. ఫలితాలు వెల్లడయ్యే వరకు సర్వత్రా ఉత్కంఠే..

## ఎన్నికల విధుల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు




ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అసెంబ్లీ ఎన్నికల్లో సహాయకులుగా పని చేస్తున్నారు. పట్టణంలోని మినీస్టేడియంలో బుధవారం ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 20మంది విద్యార్థులు సహాయకులుగా పని చేశారు. గురువారం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ విభాగంలోనూ సహాయక విధులు నిర్వహించనున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎన్నికల విధుల్లో సహాయకులుగా పనిచేయడం ద్వారా వారికి అవగాహన పెంపొందుతుందని రిటర్నింగ్ అధికారి వెంకట మాధవ రావు చెప్పారు.

## ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి బుధవారం సందర్శించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. అందులో భాగంగా శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చేపడుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఆ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా....? లేదా....? అనే అంశాలను ఆమె ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని చెక్‌లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా....? లేదా....? అని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని కలెక్టర్ ఎన్నికల అధికారులకు సూచించారు. పోలింగ్ సిబ్బందితోపాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా ఆమె పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేస్తుండాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని ఆర్‌ఓలకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ కూడా ప్రశాంతంగా జరిగేలా ఆమె తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రిటర్నింగ్ అధికారి బి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## దోపిడీ దొంగల హల్‌చల్

- వాహనాలకు ఆపి డబ్బు వసూళ్లు
- పట్టుకునేందుకు యత్నించిన స్థానికులు
- తప్పించుకున్న దుండగులు



దుండగులు వదిలిపోయిన స్కూటీ ఇదే

చేవెళ్ల: దారిన పోయే వాహనాలను ఆపి, కత్తులతో బెదిరించి కొందరు దుండగులు డబ్బులు వసూళ్లకు పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేవెళ్ల మండల కేంద్రానికి చెందిన గుత్తి శ్రీనివాస్‌కు చెందిన లారీ, కంకర లోడ్‌తో కోకాపేట నుంచి చేవెళ్లకు వెళ్తోంది. అర్ధరాత్రి 1 గంట సమయంలో దేవునిఎర్రవల్లి బస్‌స్టేజీ వద్దకు రాగానే దుండగులు రోడ్డుపై రెండు స్కూటీలు అడ్డుగా పెట్టి, కత్తులు, రాడ్‌లను పట్టుకొని లారీని అడ్డుకున్నారు. అప్రమత్తమైన లారీ డ్రైవర్.. కిందికు దిగకుండా యజమానికి సమాచారం చేరవేశాడు. సమీపానే ఉన్న శ్రీనివాస్ నలుగురు వ్యక్తులను తీసుకొని ఘటనా ప్రాంతానికి వచ్చాడు. అప్పటికే డ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న రూ.5,600లను లాక్కున్నారు. నలుగురితో వస్తున్న యజమానిని గమనించిన డ్రైవర్ అరవడంతో దుండగులు ఒక స్కూటీని వదిలేసి మరో స్కూటీతో పరారయ్యారు. వెంబడించినా దొరకపోవటంతో స్కూటీని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం ఇలాంటి ఘటనే ఇదే ప్రాంతంలో జరిగిందన్న ఫిర్యాదు కూడా అందడంతో సీఐ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- ఓటర్లకు తగిన సౌకర్యాలు కల్పించాలి
- అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి
- మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొంరాస్‌పేట: ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు ప్రశాంతగా జరగాలని అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కొడంగల్ నియోజవర్గం రావులపల్లి, కొడంగల్, హస్నాబాద్, రేగడిమైలారం, తుంకిమెట్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో మహిళా ఆదర్శ పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించారు.



మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

**144 సెక్షన్ అమలు**

పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, కెమెరాలను అనుమతించవద్దని ఆదేశించారు. వాహనాలను కేంద్రాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీ వెంట సీఐ రాములు, సిబ్బంది శ్రీనివాసులు ఉన్నారు.

## నాలెడ్జి సిటీలో సీ1 గ్లోబల్ ఇన్నోవేషన్ కేపబిలిటీస్ సెంటర్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలో సీ1 (కన్వర్జ్‌వన్) గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీస్ సెంటర్ (జీఐసీసీ) తన కార్యకలాపాలను భారతదేశంలో ప్రారంభించింది. ఈ సంస్థ కార్యాలయాన్ని బుధవారం జీఐసీసీ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ ప్రారంభించారు. సీ1 అధునాతన సాంకేతికత, పరిష్కారాల సంస్థ. దీన్ని ప్రారంభించిన అనంతరం విలేకరులతో ఆ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ మాట్లాడుతూ 10వేలకు పైగా గ్లోబల్ వినియోగదారులకు వినూత్న పరిష్కారాలను, అసమానమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీ1 ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ కొలీన్ హేబర్‌మాన్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అమృత్‌చౌదరి, అధికారులు పాల్గొన్నారు.



## నిమ్స్‌లో వాకథాన్

లక్డీకాపూల్: మూవ్‌మెంట్ డిసార్డర్స్ సమస్యల పరిష్కారానికి నిమ్స్ యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి, అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బుధవారం నిమ్స్‌లో ప్రపంచ మూమెంట్ డిసార్డర్ దినోత్సవం సందర్భంగా వాక్‌థాన్ జరిగింది. నిమ్స్ న్యూరాలజీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యనిపుణులు మాట్లాడుతూ.. మూమెంట్ డిసార్డర్ సమస్యతో బాధపడేవాళ్ల శరీరంలో కదలికలు లేకుండా ఉండే ప్రమాదం ఉందని, దాని వల్ల ఆయా వ్యక్తులు తమ తమ జీవనగమనంలో స్తబ్ధత నెలకొంటుందన్నారు. ఫలితంగా ఏం చేయాలన్నా, ఎక్కడికి వెళ్లాలన్నా కదలకపోవడం రుగ్మతను ఎదుర్కొంటారన్నారు. తొలుత నిమ్స్ క్యాంపస్‌లోని ట్రామా బ్లాక్ నుండి ఓల్డ్ ఎంట్రన్స్ వరకు మూమెంట్ డిసార్డర్స్ ఉన్న రోగులకు మద్దతుగా న్యూరాలజీ, ఎలక్ట్రోఫిజియాలజీ విభాగం, న్యూరోసర్జరీ, ఫిజియోథెరపీ, నర్సింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన సీనియర్ వైద్యనిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైలెంట్ వాక్ నిర్వహించారు.ఢిల్లీ ఎయిమ్స్ నుంచి డాక్టర్ దీప్తి, ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్ వైద్యులు డాక్టర్ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ చర్యలు






సైబరాబాద్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్‌లో పరిశీలిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

**169.30 కోట్ల విలువ చేసే సొత్తు, నగదు స్వాధీనం**

- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఇప్పటివరకు జరిగిన తనిఖీల్లో మొత్తం రూ.169.30 కోట్ల సొత్తు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సీపీ ఈ వివరాలు వెల్లడించారు. రూ.99.53 కోట్ల విలువ చేసే బంగారు, వెండి, డైమండ్స్ ఆభరణాలను, రూ.62.60 కోట్ల నగదు, రూ.1.29 కోట్ల విలువ చేసే మద్యం, రూ.3.26 కోట్ల విలువ చేసే గంజాయి, రూ.2.57 కోట్ల విలువచేసే ఫ్రీబీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పరిధిలో 23 ఇంటర్ డిస్ట్రిక్ట్ బార్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేశామన్నారు. 825 చోట్ల నాకాబందీ చేసి తనిఖీలు చేయడం ద్వారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రౌడీ షీటర్లు, ఇతరులను అదుపులోకి తీసుకొని బైండోవర్ చేశామన్నారు. లైసెన్సులు కలిగిన ఆయుధాలను కూడా స్వాధీనం చేయాలని ఆదేశించారు.

**స్వేచ్ఛగా ఓట్లు వేసేలా ఏర్పాట్లు**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నాలుగు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చెల్, సంగారెడ్డి, హైదరాబాద్‌లోని కొంత ప్రాంతంలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 3,202 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏడుగురు ఏసీపీలను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. 259 రూట్ మొబైల్స్, 27 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్(ఎఫ్ఎస్‌టీ), 24 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ) 24 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) టీమ్స్‌ను విధుల్లో నియమించారు. సైబరాబాద్ పరిధిలో 655 పోలింగ్ స్టేషన్లను క్రిటికల్‌పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ఈ ప్రాంతాలలో ప్రత్యేకంగా పారా మిలటరీ ఫోర్స్ సిబ్బందిని నియమించారు. అంతేకాకుండా మొత్తం 103 క్యూఆర్‌టీ/స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, 40 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్‌ను కూడా ఏర్పాటు చేయడం విశేషం. మొత్తం 6,400 పోలీసు సిబ్బందిని ఎన్నికల విధులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

**బ్యాలెట్ బాక్సులకు భారీ సెక్యూరిటీ**

సైబరాబాద్ పరిధిలో ఆరు డిస్ట్రిబ్యూషన్, ఆరు రిసెప్షన్‌సెంటర్లు, రెండు కౌంటింగ్ సెంటర్లలో కూడా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మూడంచెల భద్రతను ఈవీఎం, వీవీపీఏటీ మిషన్లకు కల్పించారు.ఈ ప్రాంతాలలో సీఏపీఎఫ్, టీఎస్ఎస్‌పీ, ఆర్మ్‌డ్ బలగాలు, సివిల్ పోలీసులను నియమించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు జీఐఎస్ జీఐఎస్ అప్లికేషన్‌లను పీఎస్ఐటీసీ కేంద్రాలకు కల్పించారు. వాహనాలకు జీఐఎస్ అప్లికేషన్, జీపీఆర్ఎస్‌లను వాహనాలన్నింటికీ అమర్చి పంపుతారు.

## 144 సెక్షన్ అమలు

రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఇద్దరికి మించి గుమిగూడొద్దని సూచించారు. ఆయన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని, బందోబస్తుకు స్థానిక పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను, ఏపీఎస్పీ, ఆర్మ్‌డ్‌ఫోర్స్ పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ బూత్‌లకు కేవలం ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను మాత్రమే పోలీసులు తనిఖీ చేసి పంపిస్తామని, ఇతరులకు ఎవరికీ ప్రవేశం ఉండదన్నారు. పోలింగ్ కేంద్రానికి సెల్‌ఫోన్‌తో పాటు ఇతర ఉపకరణాలను తీసుకురావొద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌ను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ బూత్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలతో పాటు సిబ్బందికి పలు సూచనలు అందించారు. పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా తమ గుర్తింపుకార్డుతో రావాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎవరూ గుమిగూడొద్దన్నారు. తమ వద్ద ఎలాంటి సమాచారమున్నా, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

### నేడు పార్కుల మూసివేత

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికల సందర్భంగా గ్రేటర్‌లోని హెచ్ఎండీఏ పార్కులన్నింటినీ గురువారం మూసి ఉంచనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ మేరకు నెక్లెస్‌రోడ్డులోని లుంబినీ, ఎన్టీఆర్‌పార్కు, లేక్‌వ్యూ, తదితర పార్కులలలో సందర్శకులకు ప్రవేశం ఉండదు.

### ఖాజాగూడలో రూ.1.60 కోట్లు పట్టివేత

గచ్చిబౌలి: ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు వాహనాల తనిఖీలో ఖాజాగూడలో రూ.1.60 కోట్లు పట్టుకున్నారు. ఇన్నోవా వాహనంలో కోటి 60 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు. ఇవి జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి అనిరుద్‌రెడ్డికి సంబంధించినవని పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి ఫస్ట్ ఎయిడ్



గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సపర్యలు చేశారు ట్రాఫిక్ పోలీసులు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వారి దగ్గరికి వెళ్ళి సపర్యలు చేసి ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి పంపించారు. ఇతర వాహనదారులు ఆయన చొరవను అభినందించారు.